క్లుప్తంగా

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో పలు పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల మృతిని నిరసిస్తూ బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని జింఖానాగ్రౌండ్‌లో చేపట్టనున్న నిరసన సందర్భంగా పట్టణ బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్‌లను ఇంటి వద్ద ఎస్సై శ్రీకాంత్ అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం మధ్యాహ్నం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్ పంపిణీ చేస్తున్న ఎస్సై నరేశ్

చింతలమానెపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై ఇస్లావత్ నరేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేతిని బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయనతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ గ్రామంలో శుక్రవారం 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని లంబాడిగూడ గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఒకరి ఇంట్లో సోదాలు నిర్వహించగా 10 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. గుడుంబాను స్వాధీనపర్చుకొని వారిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో గుడుంబా తయారు చేసినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మైనింగ్ సిబ్బంది హర్షం



మాట్లాడుతున్న మైనింగ్ సిబ్బంది

రెబ్బెన: కొత్తగూడెంలో జరిగిన 50వ స్ట్రక్చర్ కమిటీ మీటింగ్‌లో మైనింగ్ స్టాఫ్ అనారోగ్య కారణాలతో అన్‌ఫిట్ అయితే హోదా తగ్గకుండా సర్వీస్‌లో సూటిబుల్ జాబ్ కోసం శాశ్వత ఒప్పందం జరగడంతో బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేస్తూ ఏఐటీయూసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐటీయూసీ మొదటి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలోనే సుటేబుల్ జాబ్‌పై శాశ్వత ఒప్పందం జరగటం అభినందనీయమన్నారు. పెండింగ్ సమస్యలపై సైతం ఏఐటీయూసీ నాయకత్వం సంస్థ చైర్మన్‌తో చర్చించినట్లు తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను శుక్రవారం రెబ్బెన మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్‌లు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడిని కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్, దుప్పా నాయక్, బలరాం నాయక్, పల్లాస్, రవి నాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ లిబిన్ తెలిపారు. శుక్రవారం పీడీ రాకేశ్, కిరణ్‌తో కలిసి పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నేహల్, వివాన్ ప్రతిభ చూపారని, వీరు డిసెంబర్ 1న మంచిర్యాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో రాత్రి 8 గంటలకు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మెనూ ప్రకారం భోజనం, శుద్ధజలం వసతి గృహంలో పరిశుభ్రంగా ఉండేలా చేసుకోవాలని సూచించారు. వసతి గృహంలో అధ్యాపకులు రాత్రి పూట అందుబాటులో ఉండాలని మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల నుంచి మురికి నీరు బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రిన్సిపాల్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పడుకునే గదులు..

గురుకుల పాఠశాలలో విద్యార్థులు పడుకునే గదులు కిటికీలకు తలుపులు లేక విద్యార్థులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేక రాత్రి పూట ఒకటికి రెండికి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కాగా ఉన్నతాధికారులు విద్యార్థులు పడుకునే గదులను పరిశీలిస్తే అసలు సమస్య తెలుస్తుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

దహెగాం: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని తహసీల్దార్ కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని వంటగది, స్టోర్ రూం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయని ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రమేశ్ దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వంట గది, వంట సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల మెనూ ప్రకారం నాణ్యమైన వంట చేసి విద్యార్థులకు పెట్టాలన్నారు. తాజా కూరగాయలను మాత్రమే వండిపెట్టాలన్నారు. హాస్టల్ పరిసరాలను వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి): విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వెల్గీ ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో తనిఖీలు

వాంకిడి: మండలంలోని వెల్గీ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. వంట గది, స్టాక్‌రూమ్, స్నానపు గదులు, డార్మెటరీని పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో సమస్యలను తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదని తెలుసుకుని కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం దామోదర్, పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల తనిఖీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతి, పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం భోజనం సమయంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలలో పారిశుధ్యం పనులు, మరుగుదొడ్లు, స్టోర్‌రూం, సిబ్బంది రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.



దహెగాం: కల్వాడ ఆశ్రమ పాఠశాలలో స్టోర్‌రూం పరిశీలిస్తున్న తహసీల్దార్



వాంకిడి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



ఆసిఫాబాద్‌రూరల్: వంట సామగ్రి పరిశీలిస్తున్న తహసీల్దార్

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

- రాష్ట్రస్థాయికి 31 మంది విద్యార్థులు ఎంపిక
- బహుమతులు ప్రదానం చేసిన డీఈవో యాదయ్య



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ముగిసింది. విద్యార్థులు మొత్తం 358 ప్రాజెక్టులు ప్రదర్శించగా, 31 రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈవో యాదయ్య ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. వినూత్న ఆలోచనలు కలిగేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎంఈవోలు సుభాష్, ప్రభాకర్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, కమిటీ సభ్యులు ఊశన్న, హేమంత్ దేవాజీ, వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులు..

ఎంపికైన వారిలో శృతి, వంజీర పాఠశాల(కాగజ్‌నగర్), శాన్వీ, విశ్వశాంతి స్కూల్(కాగజ్‌నగర్), సాహిల్, ఇన్‌ఫోర్స్ స్కూల్ (కాగజ్‌నగర్), ప్రజ్ఞశ్రీ, కేజీబీవీ(సిర్పూర్-టీ), దహనా, మోడల్ స్కూల్ (సిర్పూర్-యూ), హారిక, కేజీబీవీ(సిర్పూర్-టీ), షేఫా నైజ్, ఉర్దూ మీడి యం స్కూల్(ఆసిఫాబాద్), అంజలి, కేజీబీవీ (పెంచికల్‌పేట్), శ్రీరామ్, రాస్పెల్లి ఉన్నత పాఠశాల(కాగజ్‌నగర్), సహిత, కేజీబీవీ(ఆసిఫాబాద్), వెన్నెల, బాలికల ఉన్నత పాఠశాల(ఆసిఫాబాద్), సుల్తాన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(కెరమెరి), శ్రీకాంత్, జన్కాపూర్ ఉన్నత పాఠశాల(ఆసిఫాబాద్), పౌర్ణమి కేజీబీవీ(కౌటాల), రాంచరణ్ తేజ, గిరిజన ఆశ్రమ పాఠశాల(కాగజ్‌నగర్), సాయిచరణ్, గిరిజన ఆశ్రమ పాఠశాల (సిర్పూర్-టి), ప్రతాప్, మహేశ్, గిరిజన ఆశ్రమ పాఠశాల(కాగజ్‌నగర్), ప్రశాంత్, గిరిజన ఆశ్రమ పాఠశాల (సిర్పూర్-టీ), శివ, గిరిజన ఆశ్రమ పాఠశాల (సిర్పూర్-టీ), అభినయ్ కుమార్, గిరిజన ఆశ్రమ పాఠశాల(సల్గుపల్లి), సూర్యవంశీ ఎంజీబీపీ స్కూల్(కాగజ్‌నగర్), అనిశ్ టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ స్కూల్(సిర్పూర్ (టీ)), శంకరమ్మ, బాలికల ఉన్నత పాఠశాల(తిర్యాణి), సంజీవ్, గిరిజన ఆశ్రమ పాఠశాల(సల్గుపల్లి), నవీన్ కారు, గిరిజన ఆశ్రమ పాఠశాల, అక్షర, కేరళ హై స్కూల్, శ్రీధర్, గిరిజన ఆశ్రమ పాఠశాల (కాగజ్‌నగర్), సోలంకి, మోడల్ స్కూల్(ఆసిఫాబాద్)లు ఉన్నారు.

అగ్నిప్రమాదంలో తీవ్ర ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పత్తి

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్‌లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన గుర్లె ప్రభాకర్ పత్తి పంటను ఇంటిలో నిల్వ ఉంచుకున్నాడు. శుక్రవారం ఇంటిలోని వారు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గ్రామస్తుల ప్రయత్నంతో మంటలు విస్తరించకుండా అదుపులోకి వచ్చాయి. ప్రమాదంలో 10క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని బాధితుడు గుర్లె ప్రభాకర్ వాపోయాడు. ఇంటిలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, సామగ్రి, ఇల్లు దగ్ధం కాగా సుమారు లక్షరూపాయల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు బలి'



మాట్లాడుతున్న కొడప శంకర్

బెజ్జూర్: అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు బలవుతున్నాయని మండల సార్మేడి కొడప శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో గిరిజన నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఏనుగు దాడిలో చింతలమానపల్లి, పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన ఇద్దరు రైతులు మృతి చెందగా.. అంతకుముందు పులి దాడిలో పెంచికల్‌పేట్ మండలానికి చెందిన వ్యవసాయ కూలీలు ఇద్దరు మృతిచెందారన్నారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ మండలంలో పత్తి పంట పనులకు వెళ్లిన మహిళపై పులి దాడి చేసి చంపివేసిందన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలకు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రాణాలు పోతున్నాయన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై గల కంకలమ్మ ఆలయ మహా జాతరలో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి శ్రీ చక్రనవవర్ణ కుంకుమార్చన చేశారు. అలాగే ఆలయంలో మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కంకలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 9 గంటలకు ఆలయంలో మహాయజ్ఞం, కూష్మాండ బలిహారణము, కళానాస్యము నిర్వహిస్తారు. శనివారం మధ్యాహ్నం 12.40 గంటలకు మహాపూర్ణాహుతి, అవబృథ స్నానము, మహదాశీర్వచనం కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు.

కోల్‌ఇండియా పోటీల్లో రాణించాలి



పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు ఏరియాలతో ప్రమేయం లేకుండా కోల్‌ఇండియా స్థాయి పోటీల్లో రాణించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 91వ డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నియర్‌బై ఏరియా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు వసతుల కల్పనలో సింగరేణి యాజమాన్యం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడాకారులు వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో రాణించాలని పేర్కొన్నారు. మందమర్రి, బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు సమష్టిగా సమన్వయంతో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి సింగరేణికి దేశవ్యాప్తంగా ఉన్న క్రీడాకీర్తిని మరింత పెంచాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఏఐటీయూసీ నాయకులు మొగిళి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

బెజ్జూర్: రేంజ్ పరిధిలోని అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెజ్జూర్ బీట్ అధికారి వెంకటేశం తెలిపారు. బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్ ఆదేశాల మేరకు మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాల రైతులు తమ పంట చేనులో వెళ్లే ముందు పెద్దఎత్తున శబ్దాలు చేస్తూ గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఆయన వెంట పాపన్నపేట బీట్ ఆఫీసర్ గోపాల్, మొగవెళ్లి బీట్ ఆఫీసర్ అనిల్, తలాయి బీట్ ఆఫీసర్ అవినాశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో దప్పుచాటింపు..

బెజ్జూర్ రేంజ్ పరిధిలోని సలుగుపల్లి, సిద్దాపూర్, మర్తిడి అటవీ బీట్‌లలో పెద్ద పులి సంచరించే అవకాశాలు ఉన్నాయని బీట్ అధికారులు మురళి, సత్యనారాయణ, బేస్‌క్యాంప్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో దప్పుచాటింపు వేస్తూ అవగాహన కల్పించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కౌటాలలో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎండీఎం కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ అశ్విని, సీసీవో మహేందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ. 10 వేలు గౌరవ వేతనం అందించాలని, కోడిగుడ్ల బిల్లులను విడుదల చేయాలన్నారు. అవసరమైన గ్యాస్ రాయితీ, గుర్తింపుకార్డులు, కాటన్ బట్టల యూనిఫామ్, సామాజిక భద్రత, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఎండీఎం కార్మికులు ఆత్రం బాగుబాయి, ఆత్రం భీంబాయి, సీహెచ్ దుర్పతబాయి, పెందోర్ కౌసల్యాబాయి, ఆత్రం కమలాబాయి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యావనరుల కేంద్రం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేసి సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు శారద, లక్ష్మి, వనిత, విమల, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రెబ్బెనలో..

రెబ్బెన: మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మాయ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనంతో పాటు కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులు రాజేశ్వరీ, గిరిబాయి, రత్నుబాయి, విజయ, మంజుల, పార్వతి, పద్మ, నిర్మల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ధర్నా

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అనుకోడ శివారులో భూతగాదాలపై పలువురు మహిళా రైతులు శుక్రవారం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు వర్గాల మధ్య నెలకొన్న భూతగాదా విషయంలో పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆందోళన చేపట్టారు. సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు సముదాయించడంతో ధర్నా విరమించారు.

ఆకట్టుకున్న కళాజాత



ఆటపాటలతో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అవగాహన కోసం శుక్రవారం మండల కేంద్రంతో పాటు మోడి గ్రామంలో సాంస్కృతిక కళాకారులచే ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమం ఆకట్టుకుంది, ప్రభుత్వం చేపడుతున్న భాగ్యలక్ష్మితో ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన తదితర పథకాల ద్వారా మరాఠి, గోండి, హిందీ, తెలుగు, భాషల్లో ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, డీటీ సంతోష్ కుమార్, ఎస్‌హెచ్‌వో గణేశ్, కారోబాయి వెంకటేశ్వర్లు, కళాజాత టీం లీడర్ మోహన్ నాయక్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి మురళీధర్

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి మంజూరైన భవన నిర్మాణ పనులకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళీధర్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 12 లక్షల ఈజీఎస్ నిధులతో పక్కా భవనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసరి కిషన్‌గౌడ్, సురేందర్‌రాజు, లింగంపెల్లి ప్రభాకర్, ఎర్రం తిరుపతి, దాగం పార్వతి, జనక్‌ప్రసాద్, కిషోర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బెజ్జూర్: రైతు పండుగను విజయవంతం చేయాలని బెజ్జూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఓంప్రకాశ్, కార్యదర్శి జె.సత్యనారాయణ గౌడ్‌లు కోరారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సంఘం పరిధిలో ఇప్పటి వరకు 1058 రైతులకు రూ.6.38 కోట్ల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. దేశంలో తెలంగాణ వరిధాన్యం కొనుగోళ్లలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు పండుగకు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899